క్లుప్తంగా

పేదల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న మున్నూరు కిషన్

రేగోడ్(మెదక్): పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్ అన్నారు. మండలంలోని మర్పల్లి గ్రామంలో ఆరేళ్ల క్రితం నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుప యోగంగా ఉన్న భవనాన్ని ఉపయోగంలోకి తీసుకొచ్చామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సీతారావమ్మ, ఎస్‌ఐ పోచయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఎస్.దిగంబర్‌రావు, గ్రామాధ్యక్షుడు అంజయ్య, నాయకులు భద్రారెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత రక్త పరీక్షలు



ఉచిత రక్త పరీక్షలు నిర్వహిస్తున్న సభ్యులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని యశోద ల్యాబ్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మధుమేహ రక్త పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ మండలాధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ.. 16 మందికి గురువారం మధుమేహానికి సంబంధించి ఉచిత రక్త పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. లయన్స్ క్లబ్ ద్వారా ప్రతీ వారం ఉచిత రక్త పరీక్షలను నిర్వహిస్తున్నట్లు నాగరాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాంచంద్రం లయన్స్ ప్రతినిధులు నాగరాజు, సిద్ధిరాములు బాబూలాల్ తదితరులు ఉన్నారు.

సన్మానం



మైనంపల్లి హన్మంతరావును సన్మానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

నర్సాపూర్: కాంగ్రెస్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు గురువారం సన్మానించారు. హన్మంతరావు దుర్గామాత దీక్ష చేపట్టి, నర్సాపూర్ మీదుగా ఏడుపాయల వనదుర్గామాత ఆలయానికి వెళ్తుండగా ఆయన కాన్వాయ్‌ని ఎస్‌బీఐ కూడలి వద్ద ఆపి ఆయనను శాలువాతో సన్మానించారు. అనంతరం హన్మంతరావు, ఆంజనేయులుగౌడ్‌లు నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులపై కొద్దిసేపు చర్చించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వెంకటాపూర్(ఆర్)లో ఉచిత వైద్యశిబిరం



వైద్యశిబిరంలో ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న వైద్యులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెంకటాపూర్(ఆర్)లో గురువారం హైదరాబాద్ మల్లారెడ్డి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేశారు. ఆస్పత్రి డాక్టర్లు శివశంకర్, మధుమిత 114 మంది రోగులకు సాధారణ చికిత్సలతో పాటు కంటి పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌ఓ హరికృష్ణ, వైద్యసిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

కల్హేర్(నారాయణఖేడ్): మండలం పరిధిలోని ఇందిరానగర్‌లోని రేణుక ఎల్లమ్మ, గురు దత్త త్రేయ మందిరంలో కాళికామాత, నవనాథ విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. అంతర్‌గాం గజేంద్ర ఆశ్రమం పీఠాధిపతి కరణగజేంద్ర మహరాజ్ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మశ్చేందర్ దంపతులు హోమం నిర్వహించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తుకారాం, బీఆర్‌ఎస్ నాయకులు కిష్టారెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.



చాముండేశ్వరి అమ్మవారికి మహాభిషేకం చేస్తున్న అర్చకులు



బగలాముఖీ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



కౌడిపల్లి(నర్సాపూర్): అమ్మవారికి పూజలు

వైభవంగా దేవి శరన్నవరాత్రులు ప్రారంభం

జిల్లా వ్యాప్తంగా దేవి శరన్నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో ప్రతిష్ఠించిన అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మొదటిరోజు బాలా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు దర్శనమించారు.




పెద్దశంకరంపేటలో దుర్గాభవానీ ఆలయంలో ..



మనోహరాబాద్(తూప్రాన్): కాళ్లకల్‌లో ..



చిన్నశంకరంపేట(మెదక్): కొర్విపల్లిలో..



అల్లాదుర్గంలో ఏర్పాటు చేసిన దుర్గమాత

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): సీఎంఆర్‌ఎఫ్(ముఖ్యమంత్రి సహాయనిధి) పేదలకు వరంలాంటిదని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. గురువారం పెద్దశంకరంపేట మండలంలోని పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల సంక్షేమానికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సేవలను అందిస్తున్నారని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు ఆర్‌ఎన్.సంతోష్, రఘుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న సంజీవరెడ్డి

ప్రభుత్వ భూమిని కాపాడండి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గోమారంలో కబ్జా చేసిన ప్రభుత్వ భూమిని కాపాలని తహసీల్దార్ కమలాద్రికి గురువారం పలువురు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గ్రామ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేసి చుట్టూ పలకలు ఏర్పాటు చేసినట్లు రామకృష్ణారెడ్డి, కుంట లక్ష్మణ్, రాకేశ్‌రెడ్డి ఆరోపించారు. సర్వేచేసి ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చినట్లు వారు చెప్పారు.

బస్సు సర్వీసులు నడపండి



మేడ్చల్ డిపో మేనేజర్‌కు లెటర్‌ను అందజేస్తున్న బీజేపీ నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తి నుంచి వివిధ రూట్లలో బస్సు సర్వీసులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను మండల బీజేపీ నాయకులు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారానికి ఆయన సానుకూలంగా స్పందించారు. మండల ప్రజల రవాణా వ్యవస్థ మెరుగుపరచాలంటూ వెల్దుర్తి నుంచి తూప్రాన్, వెల్దుర్తి నుంచి గుమ్మడిదల మీదుగా జేబీఎస్ వరకు వేర్వేరుగా రెండు బస్సు సర్వీసులు, మంగళపర్తి నుంచి వెల్దుర్తి మీదుగా తూప్రాన్ వరకు మరో రెండు బస్సు సర్వీసులు నడపాలంటూ ఎంపీ మేడ్చల్ డిపో మేనేజర్‌కు లేఖ రాశారు. ఇందుకు సంబంధించిన ఎంపీ లెటర్‌ను గురువారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో మండల నాయకులు మేడ్చల్ డిపో మేనేజర్‌కు అందజేశారు. ఆయా రూట్లలో సర్వే చేయించి బస్సులు నడిపేలా చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ హామీనిచ్చాడని ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు నవీన్, నాగరాజు, పవన్‌రాజ్ తదితరులు ఉన్నారు.

పిల్లల పార్కును ప్రారంభించండి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం

మెదక్ కలెక్టరేట్: జిల్లా కేంద్రం మెదక్‌లోని పిల్లల పార్కును ఓపెన్ చేయాలని, ట్యాంక్‌బండ్‌కు మంజూరైన రూ.9 కోట్లు ఖర్చు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మెదక్‌లోని టీఎన్‌జీఓ భవన్‌లో సీపీఎం ఏరియా రెండో మహాసభ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం జెండాను ఆవిష్కరించారు. అనంతరం కామ్రెడ్ ఏచూరి సీతారాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన మహాసభలో ఆయన మాట్లాడుతూ.. కూరగాయల మార్కెట్ వద్ద నిర్మించిన సమీకృత మార్కెట్ భవనాన్ని వినియోగంలో తేవాలన్నారు. పట్టణ మున్సిపల్ పరిధిల్లోని ప్రజలకు ఉపాధి పథకాన్ని అమలు చేయాలని తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మెదక్ ఏరియా కమిటీ కార్యదర్శిగా మల్లేశం, సహాయ కార్యదర్శులు సీహెచ్ లచ్చగౌడ్, బాల నర్సయ్య, దేవయ్య, యశోద, నాగమణి సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి వర్గ సభ్యుడు మల్లేశం, బసవరాజు, జిల్లా నాయకులు మల్లేశం, నారాయణ, మైనుద్దీన్, షౌకత్, యాదగిరి, భీమేశ్, దాసు, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం

చికిత్స పొందుతూ మహిళ మృతి



లక్ష్మి(ఫైల్)

దుబ్బాకరూరల్: బైక్‌పై నుంచి పడిన ఓ మహిళ మృతి చెందిన ఘటన పోతారెడ్డిపేటలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరీశ్ కథనం ప్రకారం.. మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామానికి చెందిన గాద లక్ష్మి(40) గతనెల 25న తన కుమారుడితో కలిసి బైక్‌పై మెదక్ జిల్లా నిజాంపేట మండలం కల్వకుంట గ్రామంలోని తన బంధువుల ఇంటికి బయలుదేరారు. పోతారెడ్డిపేట వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి కింద పడడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం గత నెల 28న గాంధీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పీడీఎస్‌యూ పోస్టర్ ఆవిష్కరణ

జహీరాబాద్ టౌన్: ఈ నెల 24న నిర్వహించనున్న పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ద ఉత్సవాల వాల్ పోస్టర్‌ను గురువారం సంఘం నాయకులు పట్టణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ.. పీడీఎస్‌యూ స్థాపించి 50 సంవత్సరాల పూర్తవుతున్న సందర్భంగా ఓయూలోని ఆడిటోరియంలో పెద్ద ఎత్తున ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భాస్కర్, ఏలియా, ఆకాష్ బాబు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను గురువారం వ్యవసాయశాఖ అధికారిణి లావణ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె దుకాణాల్లోని ఎరువుల నిల్వ, రేట్లు, అమ్మకపు రోజు పుస్తకాలను పరిశీలించారు. అనుమతిలేని బ్రాండ్ల ఎరువులను విక్రయించరాదన్నారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసిన సమయంలో విధిగా బిల్లులు ఇవ్వాలని, దుకాణాల ఎదుట ధర పట్టిక ఏర్పాటు చేయాలని సూచించారు. లేనినట్లయితే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు.

ఒక్కేసి పువ్వేసి చందమామ



హవేళిఘణాపూర్(మెదక్): డైట్ కళాశాలలో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న విద్యార్థినులు, సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటతో పలు గ్రామాల్లో చిన్న బతుకమ్మల సందడి నెలకొంది. మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా వివిధ రకాల పూలతో పేర్చిన బతుకమ్మలను ఆలయాల వద్ద పెట్టి ఆడారు. అనంతరం చెరువులు, కుంటలు, కోనేటిల్లో నిమజ్జనం చేశారు.

డైట్ కళాశాలలో..

హవేళిఘణాపూర్(మెదక్): హవేళిఘణాపూర్ డైట్ కళాశాలలో గురువారం పాఠశాల విద్యార్థినులు, సిబ్బంది బతుకమ్మలను పేర్చి కళాశాల ఎదుట ఉంచి బతుకమ్మ ఆడారు.



శివ్వంపేటలో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: పార్టీలకు అతీతంగా అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి పేర్కొన్నారు. గురువారం పలువురు లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకం చెక్కులు అందజేశారు. గతంలో పార్టీలపరంగా చెక్కులు అందజేసి, కాంగ్రెస్ సానుభూతిపరుల చెక్కులను ఆపి, చించేసిన సంఘటనలు జరిగాయన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు దిగంబర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రాజు, నాయకులు అశోక్‌రెడ్డి, సిద్దారెడ్డి, రాధాకిషన్ పాల్గొన్నారు.

యాగాన్ని జయప్రదం చేయండి

లలితా వైభవం ట్రస్టు ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఖేడ్‌లో 6న నిర్వహించనున్న రుద్ర నవచండీ యాగం మహోత్సవాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి కోరారు. కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్, పట్టణ పురోహితులు మహన్ జ్యోషిలతో కలిసి ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ప్రముఖ సహస్రావధాని, పద్మశ్రీ పురస్కార గ్రహీత గరికపాటి నరసింహారావు, రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి శ్రీమాదవానందస్వామి పాల్గొననున్నారు.

చెట్లను నరికిన రైతుకు నోటీసు

కొండపాక(గజ్వేల్): కొండపాక, తొగుట సరిహద్దు మండల శివారులోని బీటీరోడ్డు పక్కన హరితాహారం పథకంలో భాగంగా నాటిన చెట్లను ఓ రైతు నరకడంతో ఫారెస్టు అధికారులు నోటీసు జారీ చేశారు. ఖమ్మంపల్లి నుంచి పెద్ద మాసాన్‌పల్లికి వెళ్లే బీటీ రోడ్డు ప్రక్కన సుమారు కిలో మీటరు మేర ఎనిమిదేళ్ల క్రితం వివిధ రకాల చెట్లను నాటారు. ఓ రైతు వాటిని మెషిన్ సాయంతో నరికాడు. దీనిపై 'పచ్చని చెట్లపై గొడ్డలి వేటు' అనే కథనాన్ని సెప్టెంబరు 25న సాక్షి దినపత్రికలో ప్రచురించింది. ఈ కథనానికి ఫారెస్టు అధికారులు స్పందించారు. చెట్లను నరికిన రైతుకి అధికారులు నోటీసు జారీ చేయగా తీసుకోవడానికి నిరాకరించాడు. దీంతో అతడి ఇంటి గోడకు అతికించారు. అయినా స్పందించని రైతు తీరుపై ఫారెస్టు ఉన్నతాధికారులకు నివేదిస్తామంటూ డీఆర్వో పద్మ తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్

కొత్తచెరువుతండాలో తీజ్ ఉత్సవాలు



పూజలు చేస్తున్న గిరిజన యువతులు, తండావాసులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కొత్తచెరువు తండాలో గురువారం తండావాసులు తీజ్ ఉత్సవాలను వైభవంగా ప్రారంభించారు. గ్రామ మాజీ సర్పంచ్ పద్మ, నాయకులు దూద్యనాయక్ ఆధ్వర్యంలో తండావాసులు జగదాంబమాత, శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయం వద్ద ఆలయ అర్చకుడు కిషన్‌నాయక్ పూజలు నిర్వహించారు. యువతులు, చిన్నారులు బుట్టల్లో నవధాన్యాన్ని తీసుకొచ్చి దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. తొమ్మిది రోజుల పాటు విత్తనాల బుట్టకు పూజలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తండావాసులు, యువకులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- చైర్‌పర్సన్ గన్నె వనితారెడ్డి

దుబ్బాక: దుబ్బాక మున్సిపాలిటీ అభివృద్ధికి అన్నివిధాలుగా చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ గన్నె వనిత అన్నారు. గురువారం ఆమె అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశంలో ప్రవేశపెట్టిన 13 అజెండా అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. గతంలో పనిచేసిన పారిశుద్ధ్య కార్మికుల బకాయి వేతనాలను ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటుగా అభివృద్ధి పనులకు అవసరమయ్యే నిధులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఆయన వెంటనే స్పందించి తప్పకుండా సీడీఎంఏ ద్వారా నిధులు మంజూరుకు కృషిచేస్తానని చెప్పారు. బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ సుగుణ, కమిషనర్ రమేశ్‌కుమార్, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా విద్యుత్ సరఫరా

కరెంట్ లేక వినియోగదారుల అవస్థలు / పట్టించుకోని అధికారులు

అల్లాదుర్గం(మెదక్): ఉచిత విద్యుత్ అస్తవ్యస్తంగా మారింది. కరెంట్ లేక వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. విద్యుత్ సమస్యపై అధికారులకు ఫోన్ చేస్తే ఎత్తడం లేదని, సమస్య పరిష్కరించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. అల్లాదుర్గంలో వారం రోజులుగా కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎంత సేపు ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఆదివారం రాత్రి పోయిన కరెంట్ మంగళవారం 11 గంటల వరకు రాలేదు. తర్వాత వచ్చిన గంట, గంటకు పోతుండటంతో వినియోగదారులు ఇబ్బందుల పాలవుతున్నారు. ప్రస్తుతం దసరా సీజన్ కావడంతో టైలర్ షాపు యాజమానులు డ్రెస్సులు కుట్టడానికి పడరాని పాట్లు పడుతున్నారు. కరెంట్ లేక తెల్లవారే వరకు దోమలతో సవాసం చేస్తున్నారు. విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇస్తే ఉచితంగా ఇస్తున్నాం. ఇష్టం వచ్చినప్పుడు చేస్తామని సమాధానం ఇస్తున్నట్లు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అల్లాదుర్గంలో మరమ్మతు చేసి ఏర్పాటు చేసిన రెండు గంటలకే పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్

ఫోన్ ఎత్తని విద్యుత్ అధికారులు

అల్లాదుర్గంలో విద్యుత్ కార్యాలయం కిలోమీటర్ దూరంలో, గ్రామ శివారులోని సబ్‌స్టేషన్‌లో కొనసాగిస్తున్నారు. కార్యాలయంలో ఏఈ, సబ్‌ఏఈ, లైన్ మెన్లు, హెల్పర్లు ఉన్న స్థానికంగా ఎవరు ఉండకపోవడంతో రాత్రి వేళ కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే పట్టించుకునే వారే దిక్కు లేరని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ ఏఈకి ఫోన్ చేస్తే ఎత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గంటల తరబడి కరెంట్ పోతున్నా.. ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. విధులు సక్రమంగా నిర్వహించని సిబ్బంది ఎందుకని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

మరమ్మతు చేసిన రెండు గంటలకే...

అల్లాదుర్గంలో పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పాపన్నపేటలోని మరమ్మతు షెడ్డుకు తరలించారు. ట్రాన్స్‌ఫార్మర్ పెట్టి కనెక్షన్ ఇచ్చిన రెండు గంటలకే పాడైపోయింది. దీంతో ప్రజలకు విద్యుత్ ఇబ్బందులు తప్పడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్‌కు టిప్పు పెట్టి పంపడం గమనార్హం. ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులు చేస్తున్నా.. రెండు, మూడు రోజులకే పాడైపోతున్నాయనే విమర్శలున్నాయి. ఇప్పటికైన విద్యుత్ శాఖ జిల్లా అధికారులు స్పందించి, సమస్యను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.